ప్రజాశక్తి

మంగళవారం 15 అక్టోబర్ 2024 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

వర్షంలో నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

నాణ్యమైన మద్యం

మహిళలకు రక్షణ కల్పిస్తుందా.?

- ఐద్వా, పిఒడబ్ల్యు నాయకుల విమర్శ
- ఒంగోలులో మద్యం టెండర్లు అడ్డుకునే యత్నం
- జోరు వానలో నిరసన వ్యక్తం చేసిన మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నాణ్యమైన మద్యం, అత్యంత చౌకధరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తామనటం సిగ్గుచేటని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ విమర్శించారు. ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో సోమవారం మద్యం టెండర్ల లాటరీ కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతున్న సందర్భంలో మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జోరువానలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సంతోషంలో రాష్ట్ర ప్రజలకు దసరా కానుకగా చౌకైన ధరలకు నాణ్యమైన మద్యాన్ని ఇస్తామని మద్యం టెండర్లకు సిద్ధపడటాన్ని ఖండించారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, తాగటానికి కనీసం రక్షిత మంచినీరు అందించలేని ప్రభుత్వాలు నాణ్యమైన మద్యాన్ని ▶ 2లో

ఎడతెరిపి లేని వాన

కొత్తపట్నంలో ముందుకొచ్చిన సముద్రం

- కలెక్టర్లతో సిఎం టెలీకాన్ఫరెన్స్
- అప్రమత్తంగా ఉండాలని మంత్రులు గొట్టిపాటి, స్వామి ఆదేశం
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో సోమవారం తెల్లవారుజాము నుంచీ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జిల్లాఅంతటా వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేయడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. సిఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి ▶ 2లో

వర్షాలకు ఒంగోలులో జలమయమైన ఆర్టీసీ బస్టాండ్ సెంటర్

భట్టిప్రోలులో నీటమునిగిన అద్దేపల్లి బాడవ పొలాలు

లాటరీ తీస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ముగిసిన మద్యం షాపుల కేటాయింపు

▶ 8లో

పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

సాగునీటి సంఘాలకు

దశాబ్దకాలం తర్వాత ఎన్నికలు

- 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార పార్టీ నేతలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. దశాబ్దకాలం అనంతరం సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరుగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలను అధికార పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సాగునీటి వనరుల వారీగా నీటి వినియోగదారుల సంఘాలకు జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నవంబరు 22 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే దిశగా ప్రణాళిక రూపొందించారు. సాగునీటి సంఘాలకు చివరిగా 2015లో ఎన్నికలు జరిగాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎన్నికల ఊసే లేకపోయింది. సంఘాలు ఉన్న సమయంలో రైతులే కాలువల మరమ్మతుల అవసరాలను గుర్తించి ఖరీఫ్ పంటల సాగుకు ముందే కాలువల పూడికలు తీయడం, గట్లను పటిష్టపరచడం చేసుకునేవారు. నీటి తీరువా ద్వారా వచ్చే నిధులతో పాటు ప్రభుత్వం కూడా సాగునీటి సంఘాలకు కావలసిన నిధులిచ్చేవారు. గడిచిన ఐదేళ్ల కాలంలో సఘాలకు ఎన్నికలు జరగకపోవడంతో పాటు కాలువల బాగు కోసం నిధులు కూడా రాని దుస్థితి నెలకొంది. ఈ కారణంగా కాలువ పూడికతీత పనులు, మరమ్మతులు, కాలువ గట్ల బలోపేతం వంటి క్షేత్రస్థాయిలో ముఖ్యమైన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నీటితీరువా వసూళ్లు కూడా జరగలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి తుఫాన్లు, భారీ వర్షాల కారణంగా పంట కాలువలు దెబ్బతిన్నాయి. కాలువ చివరి భూములకు సాగునీరందక రైతులు పంటను నష్టపోయారు. ఈ నేపథ్యంలో రైతాంగ శ్రేయస్సే ధ్యేయంగా సాగునీటి ▶ 3లో

కొమ్మమూరు కాలువ (ఫైల్)

గ్రామాల ప్రగతే

'పల్లె పండుగ' లక్ష్యం

- రూ.4500 కోట్లతో ఒకేసారి 30 వేల పనులు
- దేశాభివృద్ధికి పట్టుకొమ్మలైన పంచాయతీలను జగన్ నిర్వీర్యం చేశారు
- మంత్రి డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-కొండపి

గ్రామాల ప్రగతే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నుంచి వారం రోజుల పాటు పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సోమవారం కొండపి మండలం, పెట్లూరు గ్రామంలో మంత్రి స్వామి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూ.30 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిమెంట్ రోడ్లు మరియు సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడ్డ 4 నెలల్లోనే రాష్ట్రంలో రూ.4500 కోట్లతో 30 వేల పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల ప్రగతే లక్ష్యంతో పల్లె పండుగ కార్యక్రమం కింద మంజూరైన పనులకు వారం రోజుల పాటు శంకుస్థాపన కార్యక్రమాలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోని ▶ 2లో

ఎడతెరిపి లేన వాన

(మొదటిపేజీ తరువాయి)

రవికుమార్ కోరారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రులు ఆదేశించారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని, వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు కూడా జాగ్రత్తగా ఉండాలని మంత్రులు కోరారు. ఇక జిల్లా అంతటా సోమవారం నాడు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షాల్లోనే మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు పల్లె పండుగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరో వైపు మద్యం దుకాణాలకు లాటరీని కూడా నిర్వహించారు. ఇక వర్షాల నేపథ్యంలో మంగళవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. సోమవారం నాడు అన్ని విద్యాసంస్థలకు సెలవు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు యంత్రాంగాన్ని మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో కలెక్టర్ అన్సారియా కూడా జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. తీర ప్రాంత మండలాల్లో తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను వివరించి దిశానిర్దేశం చేశారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. లోతట్టుప్రాంతాల ప్రజలను పునరావాసం కేంద్రాలకు, తుపాను కేంద్రాలకు తరలించి.. అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలన్నారు. ఆహారం, మందులు వంటివి అందుబాటులో ఉంచాలన్నారు. భారీవర్షాల రీత్యా మంగళవారం నాడు కూడా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ అన్సారియా వెల్లడించారు. సంక్షేమ హాస్టళ్లు ప్రమాదంగా ఉంటే సమీపంలోని సురక్షిత భవనాల్లోకి విద్యార్థులను తరలించాలని కోరారు. వర్షాలకు పంటలు మునగకుండా చర్య లు తీసుకోవాలన్నారు. మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని తీరప్రాంత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, నీటిపారు దల, గ్రామీణ నీటిసరఫరా శాఖల అధికారులు, సిబ్బంది అందరూ ఫీల్డ్‌లోనే ఉండా లని కలెక్టర్ అన్సారియా గట్టిగా ఆదేశించారు. వివిధ శాఖల సమన్వయం కోసం కంట్రోల్‌రూములు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి గంటకూ వర్షాలపై పరిస్థితిని తనకు నివేదించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సముద్రపు అలలు ఉధృతం

అల్పపీడనం కారణంగా సముద్రంలో అలలు ఉధృతంగా వస్తున్నాయి. సముద్రం సుమారు పది మీటర్లు ముందుకొచ్చినట్లు మత్స్య కారులు అంటున్నారు. ప్రమాద హెచ్చరికలు ఉండటంతో బోట్లను రోడ్డు వైపునకు తరలించారు.

రైతుల్లో భయాందోళన

గత నెలలో కురిసిన వర్షాల కారణంగా బాపట్ల జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో ప్రారంభమై.. రైతులను దెబ్బతీసిన వర్షాలు ప్రస్తుత రబీ సీజన్‌లో కూడా కొనసాగుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం భారీవర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 401 మి.మీ.ల మేర వర్షపాతం నమోదయింది. జిల్లా అంతటా వర్షాలు దంచి కొట్టాయి. బాపట్ల, చుండూరు, అమృతలూరు, పిట్టవానిపాలెం, కారంచేడు, జె.పంగులూరు, చినగంజాం తదితర ప్రాంతాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. మరో మూడు రోజులు భారీవర్షాలు పడతాయని వెల్లడవుతున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాణ్యమైన మద్యం మహిళలకు రక్షణ కల్పిస్తుందా.?

(మొదటిపేజీ తరువాయి)

అందించి రాష్ట్రంలో ఏమి సాధించాలనుకుంటున్నారని వారు ప్రశ్నించారు. మద్యాన్ని వ్యాపారంగా మార్చి రాష్ట్ర ప్రభుత్వం ఒక ఆదాయ వనరుగా మార్చుకోవటం అత్యంత విచారకరమన్నారు. గత ప్రభుత్వ కాలంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పి మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మటంతో ఆ ప్రభుత్వానికి మహిళలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. మద్యాన్ని నియంత్రించి, నేరాలు ఘోరాలు అరికట్టాల్సిన ప్రభుత్వం కొత్త పాలసీని తెచ్చి విచ్చలవిడి మద్యం అమ్మకాలకు రూపకల్పన చేయటం అత్యధిక మెజారిటీతో గెలిపించిన రాష్ట్ర ప్రజలు, మహిళలను అవమానపరచడమేనన్నారు. రాష్ట్రంలో మద్యం, మత్తుమందుల ప్రభావం క్రమంగా పెరిగి యువత చెడు మార్గాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ తెలిసిన ప్రభుత్వం నేడు కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చి మద్యం విచ్చలవిడి అమ్మకాలను ప్రోత్సహించటం అమానుషమన్నారు. వెంటనే మద్యం పాలసీని వెనక్కి తీసుకోవాలని, మద్య నిషేధం అమలుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలను పోలీసులు చెదరగొట్టి ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి బి.పద్మను అరెస్టు చేసి ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు గంటల అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. నిరసనలో ఐద్వా నాయకులు జి.ఆదిలక్ష్మి, యన్.మాలతి, బి.పెద్ద గోవిందమ్మ, పిఒడబ్ల్యు నాయకులు ఎస్.కె అమ్మాజీ, సుజాత, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, నాయకులు బి వీరాస్వామి, పిడిఎస్‌యు నాయకులు శ్యామ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 106/2023

మునగానురి బాల రంగయ్య చనిపోయారు మరియు వారి వారసులు మునగానురి రామ సుబ్బమ్మ మరియు ముగ్గురు ...వాదులు

వర్సస్

షేక్ పెద్ద ఖాసిం పీరా ...ప్రతివాది

టు,
ప్రతివాది చిరునామా
ప్రతివాది) షేక్ పెద్ద ఖాసిం పీరా
తండ్రి షేక్ కంచిపల్లి చిన్న ఖాసిం పీరా,
వయసు సుమారు 52 సంవత్సరాలు, ముస్లిం,
మోజన్, అంబవరం గ్రామం మరియు పోస్ట్,
గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా,
సెల్ నెం 9848571964.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 16వ తేదీ అక్టోబర్ నెల 2024 సం॥లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 14-10-2024

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

గ్రామాల ప్రగతే 'పల్లె పండుగ' లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలో చేపట్టనున్నట్లు వివరించారు. ఇంత పెద్ద ఎత్తున అభివద్ధి కార్యక్రమాలు చేయడం ఒక రికార్డని మంత్రి అన్నారు. చిత్త శుద్ధితో వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ఎస్‌సి కార్పొరేషన్‌తో స్వయం సహాయక సంఘాలను సమన్వయం చేసుకొని త్వరలో రూ.50 వేల సబ్సిడీతో ఉన్నతి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల అభివద్ధికి, ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు, సామాజిక పెన్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, డిపిఒ వెంకట నాయుడు, సర్పంచ్ ఏ.ఝాన్సీరాణి, తహశీల్దార్ మురళి, ఎంపిడిఓ రామాంజనేయులు పాల్గొన్నారు.

స్మశాన భూములు లేని

ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై వినతి పత్రాలను అందించారు. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. సమాజంలో అన్నింటిలోనూ వెనుకబడిన ఎస్సీ, ఎస్టీలను గుర్తించి వారి సమస్యలు పరిష్క రించాలని కలెక్టర్ చెప్పారు. గ్రీవెన్స్ లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పిజిఆర్ఎస్‌పై అధిక ప్రాధాన్యత చూపాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. నేటికీ ఆధార్ కార్డ్ లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే ఆధార్ కార్డు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి గ్లోరియా, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బస్సులు లేక ఇక్కట్లు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దసరా సెలవులు ముగియడంతో పాటు పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉద్యోగస్తులు పెద్దదోర్నాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు పెద్దదోర్నాలలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు సకాలంలో రాకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దసరాకు ముందు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల సంఖ్య పెంచామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం తీరా పండుగ ముగిసిన తర్వాత బస్సులను అదనంగా కేటాయించకుండా ఉన్న బస్సులతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరైన పద్ధతి కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

గుంటూరు జిల్లా గుంటూరు సిటీలోని పాత గుంటూరుకు చెందిన పులగం ఆంజనేయులు భార్య పులగం దుర్గ నకు చెందిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెంలో జిరాక్స్ తీయిస్తుండగా పోయినవి. డాక్యుమెంటు నెం: 7776/2014. వెదికినా కనిపించలేదు. ఎవరికైనా దొరికినయెడల తమకు అందజేయగలరని మనవి.

పులగం దుర్గ
భర్త: ఆంజనేయులు
సెల్: 9440235838.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO 452/2021

కాగిపోగు కుమార్ జోసఫ్ ...వాది

వర్సస్

కాగిపోగు మత్తయ్య మరియు వగైరాలు ..ప్రతివాదులు

టు,
ప్రతివాదుల చిరునామా
D1) కాగిపోగు మత్తయ్య తండ్రి లేట్ యేసయ్య
D3) తగిలి ఎస్తేరమ్మ భర్త ఇశ్రాయేలు, హిందూ
D4) గుర్రం సుశీలమ్మ భర్త జోసెఫ్, హిందూ
D5) ఎర్రోలు ఏలిషమ్మ భర్త లింగన్న
D1, D3, D4, D5 ప్రతివాదులందరి నివాసం
చిన్న కంభం గ్రామం, కంభం మండలం,
ప్రకాశం జిల్లా.

పై O.S.No అనగా O.S.No.452/2021 పైన కనబర్చిన అడ్రస్ కు సదరు O.Sలో కోర్టు వారు ఎన్ని పర్యాయములు సమన్లు పంపిన మీరు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున సదరు O.Sలో కోర్టు వారు 17-10-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు పైన తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు స్వయముగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ కోర్టుకు హాజరయ్యి మీ ఆక్షేపణలు ఉన్న యెడల పైన తేదీన తెలియజేసుకొనవలెను. అట్లు తప్పిన యెడల మీ పై కోర్టువారు సదరు దావా ను పరోక్షంగా విమర్శించి తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 14-10-2024

ఇట్లు
శ్రీ భూతపాటి ఐజక్,
పాపుతోటి లావణ్య,
వాది తరపు న్యాయవాదులు,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ : 8639368889

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO 727/2021 in O.S.NO 452/2021

కాగిపోగు కుమార్ జోసఫ్ ...పిటిషనర్ / వాది

వర్సస్

కాగిపోగు మత్తయ్య మరియు వగైరాలు
...రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

టు,
రెస్పాండెంట్స్ / ప్రతివాదుల చిరునామా
R1) కాగిపోగు మత్తయ్య తండ్రి లేట్ యేసయ్య
R3) తగిలి ఎస్తేరమ్మ భర్త ఇశ్రాయేలు, హిందూ
R4) గుర్రం సుశీలమ్మ భర్త జోసెఫ్, హిందూ
R5) ఎర్రోలు ఏలిషమ్మ భర్త లింగన్న
R1,R3,R4,R5 రెస్పాండెంట్స్ / ప్రతివాదులందరి నివాసం చిన్న కంభం గ్రామం, కంభం మండలం,
ప్రకాశం జిల్లా.

పై I.A.No అనగా I.A.No.727/2021 పైన కనబర్చిన అడ్రస్ కు సదరు I.Aలో కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిన మీరు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున సదరు I.Aలో కోర్టు వారు 17-10-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున మీరు పైన తేదీన ఉదయం గం 10.30 నిమిషాలకు మీరు స్వయముగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ కోర్టుకు హాజరయ్యి మీ ఆక్షేపణలు ఉన్న యెడల పైన తేదీన తెలియజేసుకొనవలెను. అట్లు తప్పిన యెడల మీ పై కోర్టువారు సదరు పిటిషన్ ను పరోక్షంగా విమర్శించి తీర్మానించెదరని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 14-10-2024

ఇట్లు
శ్రీ భూతపాటి ఐజక్,
పాపుతోటి లావణ్య,
పిటిషనర్ తరపు న్యాయవాదులు,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ : 8639368889

ఇంటి డాక్యుమెంట్స్ పోయినవి

ప్రకాశం జిల్లా శింగరాయకొండ గ్రామానికి చెందిన వై. విజయరాఘవన్ తండ్రి వై.జి. కృష్ణమాచారికి చెందిన ఇంటి డాక్యుమెంట్లు పోయినవి. నెంబర్ 14 23 / 1981 కి గల డాక్యుమెంట్లు శింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ నుంచి కందుకూరు రోడ్డులోని 2వ లైనులో గల నివాసానికి వచ్చే మార్గంలో ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లు పోయినవి. దొరికిన వారు ఈ కింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

ఇట్లు
యేటూరు విజయ రాఘవన్
శింగరాయకొండ ప్రకాశం జిల్లా
ఫోన్ నెంబర్: 9581984844

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 353/2022

చిట్లురి ఎలియా ...వాది

వర్సస్

అనకారి శ్రీనివాస రావు మరియు ఇద్దరు
...ప్రతివాదులు

టు,
ప్రతివాది చిరునామా
2వ (ప్రతివాది) అనకారి జేమ్స్ S/o రోజమ్మ,
వయసు సుమారు 62 సంవత్సరాలు, హిందూ,
ఉద్యోగి, అరాఫత్ వీధి, కరెంటు ఆఫీసు వెనుక,
కందులాపురం రోడ్, కంబం మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 16వ తేదీ అక్టోబర్ నెల 2024 సం॥లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 14-10-2024

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.NO: 198/2024

గుడిమెట్ల కిరణ్ ...వాది

వర్సస్

చితిరాల వీరాంజనేయులు
తండ్రి సుబ్బరాయుడు చనిపోయారు
మరియు 1 నుండి 4 ప్రతివాదులు అతని వారసులు
చితిరాల జయ లక్ష్మి మరియు ముగ్గురు ..ప్రతివాదులు

టు,
ప్రతివాదుల చిరునామా
2వ (ప్రతివాది) చితిరాల పవన్
తండ్రి లేటు చితిరాల వీరాంజనేయులు,
వయసు సుమారు 33 సంవత్సరాలు, హిందూ,
సాఫ్ట్వేర్ ఉద్యోగి, గాంధీ నగర్, చిన్న మసీదు రోడ్,
సాయి విక్రమ్ కాలేజీ దగ్గర,
గిద్దలూరు టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.
4వ (ప్రతివాది) చితిరాల అపర్ణ
తండ్రి లేటు చితిరాల వీరాంజనేయులు,
వయసు సుమారు 25 సంవత్సరాలు, హిందూ, దర్జీ,
గాంధీ నగర్, చిన్న మసీదు రోడ్, సాయి విక్రమ్
కాలేజీ దగ్గర, గిద్దలూరు టౌన్ మరియు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది దావా ప్లైంటు పరిహారం రాగోరి మీ పై గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 15వ తేదీ అక్టోబర్ నెల 2024 సం॥లో ఉన్నది. మీరు ఆ వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేని చో మీ పరోక్షమునందు దావా విమర్శించి తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ 14-10-2024

ఇట్లు
శ్రీ షేక్ యాసిన్ బాషా,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
సెల్ నెం. 9346513649

ఎదురు చూపులేనా..?

- ఏడాదిగా నిలిచిన కొత్త పెన్షన్లు
- వివిధ సాకులతో అర్హులవి తొలగింపు
- పునరుద్ధరించాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త పెన్షన్ల కోసం పలువురు ఆశగా ఎదురుచూస్తున్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్నికలకు పది నెలల ముందు నుంచే కొత్త పెన్షన్ల మంజూరు నిలుపుదల చేసింది. వివిధ కారణాలతో కొందరి పింఛన్లు రద్దు చేసింది. వారంతా తమకు పింఛన్లు మంజూరు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. 2014-2019 మధ్య భర్త చనిపోతే భార్యకు ఎలాంటి షరతులు లేకుండా (స్పౌజ్) పెన్షన్‌ను అందించేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత కొన్నాళ్ల పాటు నెలనెలా కొత్త పింఛన్లు మంజూరు చేశారు. ఆ తర్వాత ఆరు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఏడాది కాలంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండల్లాల్లోని పలు గ్రామాల్లో సుమారు 250 మందికి పైగా మతి చెందారు. వారి భార్యలు వితంతువులుగా మారారు. మరికొంత మంది వద్ధాప్య పింఛన్లకు అర్హత సాధించారు. వీరంతా కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు.

రద్దయిన పెన్షన్లకు మోక్షం ఎప్పుడో..?

గత 15, 20 ఏళ్ల నుంచి పింఛన్లు పొందుతున్న వారికి వివిధ కారణాలతో వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. త్రల్లీ కూతుర్లు తమ భర్తలను కోల్పోయి, ఒకే రేషన్ కార్డులో ఉండగా, వారిద్దరికి ఎప్పటి నుండో వితంతు పింఛన్లు ఇస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఒకే రేషన్ కార్డులో ఉన్న తల్లీ కూతురు ఇద్దరు వితుంతు పింఛన్లు ఉంటే వాటిలో ఒకటి రద్దు చేశారు. ఈ విధంగా యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండల్లాల్లో సుమారు 150 పెన్షన్లు నిలిచిపోయాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకే రేషన్ కార్డులో ఉన్నా అర్హులైతే రెండు పింఛన్లు కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరంతా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఒకే రేషన్ కార్డుపై రెండు పింఛన్లు ఉన్నాయన్న పేరుతో రద్దు చేసిన వారికి, వివిధ కారణాలతో రద్దు చేయబడిన వారిలో అర్హులైన వారికి తక్షణమే టిడిపి కూటమి ప్రభుత్వం పెన్షన్లను పునరుద్ధరించాలని, ఈ ఏడాది కాలంలో పింఛన్లకు అర్హత సాధించిన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

పింఛను మంజూరు చేయలేదు

బొడ్డు పెద్ద ఆంజనేయరెడ్డి, మురారిపల్లి

నా వయస్సు 62 సంవత్సరాలు. రెండేళ్ల నుంచి పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటున్నా. అర్హత ఉన్నా వైసిపి ప్రభుత్వం పింఛను మంజూరు చేయలేదు. దీంతో ఇబ్బంది పడుతున్నాను. టిడిపి కూటమి ప్రభుత్వమైనా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. పింఛన్ లేని కారణంగా వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నా.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

సంగరబోయిన హనుమయ్య, పుల్లలచెరువు

నా వయస్సు 60 సంవత్సరాలు దాటింది. పింఛను కోసం సచివాలయంలో దరఖాస్తు చేశా. నేటి వరకూ పెన్షను మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకా పింఛన్లు మంజూరు చేయక పోవడంతో ఇబ్బందిగా మారింది. వెంటనే పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి.

దోపిడీ కేసులో నిందితుడికి మూడేళ్లు జైలు

ప్రజాశక్తి-దొనకొండ

ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోని బంగారు ఆభరణాలను దోపిడీ చేసిన నిందితుడికి దర్శి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డి మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... దొనకొండలోని అరబస్తాన్ వీధిలో నివాసముంటున్న చిల్లంచెర్ల వెంకటరమేష్, ఆయన భార్య రామలక్ష్మి కూల్ డ్రింక్స్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2019 జనవరి 5న పల్నాడు జిల్లా ఆత్మకూరుకు చెందిన పొన్నూరి చిన్నసత్యానందం వారి దుకాణం వద్ద వచ్చి వాటర్ బాటిల్ అడిగాడు. ఆసయంలో ఒంటిరిగా ఉన్న రామలక్ష్మి వాటర్ బాటిల్ తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లింది.చిన్నసత్యానందం కూడా ఆమె వెనుకాలే లోనికి వెళ్లి ఆమె మెడపై పిస్టల్ పెట్టి బంగారు తాళిబొట్టు తాకున్నాడు. తన వద్ద ఉన్న కత్తితో చెవి దుద్దులు కోయబోగా ఆమె గట్టిగా కేకలు పెట్టింది. దీంతో చిన్నసత్యానందం తాను తెచ్చుకున్న బైకుపై అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన చిన్నసత్యానందంకు న్యాయమూర్తి శివశంకర్‌రెడ్డి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

సాగునీటి సంఘాలకు దశాబ్దకాలం తర్వాత ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

సంఘాలకు తిరిగి ఎన్నికలు జరపడం ద్వారా నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. సాగునీటి సంఘాల ఎన్నికల కోసం కాలువ కింద పంట భూములు కలిగి ఉన్న రైతులు ఓటర్లుగా నమోదు కావలసి ఉంది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 16న నోటిఫికేషన్ అనంతరం 26న ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. 27న అభ్యంతరాల స్వీకరణ, 29న తుది ఓటర్ల జాబితా ప్రకటన చేస్తారు. 30వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల ప్రకటన చేస్తారు. ఇలా మూడు దశల్లో జరిగే ఎన్నికలు నవంబరు 22తో ముగుస్తాయి.

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 5,71,372 ఎకరాల్లో మాగాణి పంట భూములున్నాయి. దీని కింద మొత్తంగా ఉన్న సాగునీటి కాలువలకు సంబంధించి 146 సాగునీటి సంఘాలకు, 20 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సాగునీటి సంఘాలకు మూడు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి దశలో సాగునీటి సంఘాల డైరక్టర్లను ఓటర్లుగా ఉన్న రైతులు ఎన్నుకుంటారు. ఈ డైరెక్టర్ల నుంచి అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. రెండో దశలో నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అద్యక్షులను ఎన్నుకుంటారు. మూడో దశలో డిస్ట్రిబ్యూటరి కమిటీ అధ్యక్షులు జిల్లా ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకుంటారు. సాగునీటి సంఘాల ఏర్పాటు ద్వారా రైతులే తమ ప్రాంతంలోని కాలువలను బాగు చేసుకునే వీలు కలుగుతుంది. వర్షాలు దండిగా పడి రిజర్వాయర్లు అన్నీ నిండాయి. సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ దిగువ ప్రాంతాలకు నీరు చేరడం లేదు. ఇందుకోసం సాగునీటి కాల్వల మరమ్మతు, పూడికతీత, తూటికాడ తొలగింపు పనులను చేపట్టాల్సి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాల్వలు దెబ్బతినడంతో తాత్కాలిక పునరుద్ధరణ పనులకు ఆమోదం లభించింది. కృష్ణా, పశ్చిమ డెల్టా కింద పనుల కోసం రూ.9.48 కోట్ల నిధులు విడుదలయ్యాయి. సాగార్జున సాగర్ కాలువల మరమ్మతులకు రూ.2.07 కోట్ల నిధులతో పనులు చేపట్టాల్సి ఉంది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగితే ఈ పనులన్నీ సంఘాల నేతృత్వంలోనే జరగనున్నాయి.

మక్కెన యానాదయ్యకు సత్య నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని జమ్ముల పాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియన్ నాయకుడు మక్కెన యానాదయ్య దిశదిన కర్మ సోమవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని యానాదయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, టిడిపి జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, రైతు నాయకుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య

మూలగుంటపాడులో చోరీ

- ఎనిమిదన్నర సవర్లు బంగారం
- రూ.1.05 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో దాచిన ఎనిమిదిన్నర సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.05 లక్షల నగదును అప హరించారు. ఈ ఘటన శింగరాయకొండ మండలం మూలగుంటపాడు విద్యానగర్ 8వ లైన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... విద్యానగర్ 8వ లైన్‌లో నివాసముంటున్న వాకా రమణారెడ్డి దసరా పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు, చెన్నైలో ఉన్న తమ కుమారుల వద్ద వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులకొట్టి ఉంది. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా ఇంటిలోని బీరువాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన బంగారు ఆభరణలు, నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ బి.మహేంద్ర, ఎఎస్ఐ షేక్. మహబూబ్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూజ్ టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శింగరాయకొండలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగలు దోచుకుపోతున్నారు. ఎవరైనా ఇంటి తాళం వేసి ఊరు వెళ్లితే చాలు మరుసటి రోజూ ఆ ఇంట్లో చోరీ జరుగుతోంది. వారం రోజుల క్రితం మూలగుంటపాడు చెందిన రామమూర్తి అనే ఎల్ఐసి ఏజెంట్ ఇంట్లో దొంగలు పడి భారీగా బంగారం, నగదు దోచుకుపోయిన విషయం తెలిసింది. వరుస చోరీలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎఎస్ఐ

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్ తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సిమెంట్ రోడ్లు, సైడు కాలవల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి పాలనలో గ్రామాల్లో అభివద్ధి పనులు చేపట్టిన చేసిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గ్రామాల అభివద్ధికి పూనుకుందని తెలిపారు. ఏడుగుండ్లపాడులో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు, మద్దిపాడు గ్రామంలో రూ.90 లక్షలతో సైడ్ కాలువలు, రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్లు, వెల్లంపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు, తెల్లబాడు-దొడ్డవరం గ్రామాల్లో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ.20 లక్షలతో సైడు కాలువలకు, బసవన్నపాలెం గ్రామంలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ.20 లక్షలతో సైడు కాలువలకు, ఇనమనమెల్లూరులో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ.20 లక్షలతో సైడ్ కాలువలకు మొత్తం రూ.3.10 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సెక్రటరీ అడక స్వాములు, మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, నాయకులు మండవ రంగారావు, మండవ గోపీచంద్, రెబ్బవరపు ప్రభాకర్, డిఆర్ డిఎ పీడీ వసుంధర, ఎంపిడిఒ జ్యోతి, డిఇ కష్ణమోహన్, ఆయా గ్రామాల సర్పంచులు దాసరి శిల్ప సౌందర్య, మద్దిరాల వెంకటేశ్వర్లు, ఏకుల ఏడుకొండలు, చిట్టిబోయిన అనీల్, మద్దిపాడు మాజీ సర్పంచి ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, నాయకులు మండవ హరిప్రసాద్ , దాసరి రమేష్,కడియాల రఘు బాబు, నవులూరి శివకష్ణ, ఎంపిటిసి అద్దేపల్లి దుర్గభవాని, కె.రామాంజనేయులు, మల్లిపెద్ది బాలకష్ణ, అన్నాబత్తిన శ్రీనివాసరావు, వడ్డంపూడి శ్రీనివాసరావు, మల్లిపెద్ది రాజా, పవన్, ఎంపిపి వాకా అరుణ, నైనాల భావన్నారాయణ, దొప్పా శేషయ్య, కొప్పోలు విశ్వనాథం, మండవ లక్ష్మీనారాయణ, మండవ గోవిందరాజులు, ఆర్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో ఎమ్మెల్యే విజయకుమార్

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులోని రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారం నిమిత్తం వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని వినియోగదారుల హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్రరావు కోరారు. ప్రస్తుతం చాకిరేవు వద్ద అండర్ బ్రిడ్జి చిన్న వర్షానికే చెరువును తలపించే విధంగా ఉందన్నారు. వర్షం పడినప్పుడల్లా అక్కడ రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ బ్రిడిని నిర్మించాలని కోరారు. అందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆయన కోరారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

మంత్రి అనగాని సత్య ప్రసాద్

ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్య ప్రసాద్ హెచ్చరించారు. వాతావరణ శాఖ అధికారులు అందించిన వివరాల మేరకు రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అన్నారు. వర్షాలకు తడిసి ఉన్న పాతపడిన భవనాలు, రేకుల షెడ్లు, మట్టి గోడల ఇళ్లల్లోను, ఒరిగిపోయి బీటలు వారిన ప్రహరీ గోడల వెంట ప్రజలు ఉండరాదని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళవద్దని చెప్పారు. భారీ వర్షాలతో పొంగిపొర్లే వాగులు, కాలువలు, రోడ్లు, కల్వర్టులు, మ్యాన్ హెూల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. భారీ వర్షం పడేప్పుడు పిడుగులు పడే అవకాశం ఉన్నందున బయటకు వెళ్ళవద్దని సూచించారు. ఒరిగిన విద్యుత్ స్థంబాలు, తీగలు, చెట్లు, హెూర్డింగ్స్ క్రింద ఉండకుండ తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నదన్న పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు చెట్లు క్రింద, పోల్స్, టవర్స్ క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండ కుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఎంఎల్ఎ నరేంద్ర వర్మ

బాపట్ల : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచించారు. లోతట్టు, తీర ప్రాంతాల ప్రజలు వర్షం, ఈదురు గాలులు అధికమైతే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని అన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్ళవద్దని అన్నారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. నియోజకవర్గంలో అనేక చోట్ల పిడుగుల ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని అన్నారు. భారీ వర్షాలకు ఇబ్బందులు తలెత్తే ప్రాంతాల్లో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టే విధంగా అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించి సురక్షిత ప్రాంతాలు దాటి బయటకు రావద్దని అన్నారు. అన్ని విధాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

స్ట్రెచ్చర్ అందిస్తున్న నారాయణ దంపతులు

వైద్యశాలకు స్ట్రెచ్చర్ బహూకరణ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక ఏరియా వైద్యశాల్లో రోగుల సౌకర్యార్థం స్ట్రెచ్చర్‌ను మండలంలోని ఈపూరుపాలెంకు చెందిన మునగాల మైమిత, నారాయణ దంపతులు బహూకరించారు. స్ట్రెచ్చర్ బహుకరించిన దంపతులను ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పి సుభాషిని, వైద్యులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సేవా భావంతో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు. ఏరియా వైదశాల్లో ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

◆ ఏల్చూరు గ్రామ సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ◆ గ్రామ గ్రామాన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ◆ అభివృద్ధి పనుల ప్రారంభంతో పండుగ వాతావరణం

ఏల్చూరులో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

వేమూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు

ప్రజాశక్తి - సంతమాగులూరు

సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని ఏల్చూరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన పల్లె పండుగ, పంచాయితీ వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.40 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మాణం చేయనున్న అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం 2024-25 సంవత్సరంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకంలో ద్వారా గ్రామంలో చేపట్టి పూర్తయిన రూ.199లక్షల పనుల సమాచార బోర్డును పరిశీలించారు. స్థానిక సమస్యలపై ఎంపిడిఒ జ్యోతిర్మయి, తహశీల్దారు కె రవిబాబు, పంచాయతీ రాజ్ ఇతర అధికారులతో చర్చించారు. కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. గ్రామంలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు. త్వరలోనే మూడు వాటర్ ప్లాంట్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్థల సేకరణ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని అన్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో రు.4500 కోట్లతో 30వేల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అద్దంకిలో అభివృద్ధి పనులకు రు.19 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపిఒ ఎల్ ప్రభాకరరావు, డ్వామా పిడి ఎవి విజయలక్ష్మి, చీరాల ఆర్డీఒ దేవరకొండ అఖిల, పంచాయతీరాజ్ ఎస్ఇ హరే రామకృష్ణ, ఈఓ పిఆర్డి ఎన్ శివరాం ప్రసాద్, పంచాయతీరాజ్ ఎఈ నాగేశ్వరరావు, ఎపిఒ సురేష్, ఎంపీపీ వై ఎలమంద, నాయకులు డి గాలెయ్య, తేలప్రోలు రమేష్, అట్లా పెద్ద వెంకటరెడ్డి, సన్నెబోయిన గురు యాదవ్, వెంకటరావు, పసుపులేటి కోటేశ్వరరావు, మాదాల సుబ్బారావు, లక్ష్మయ్య, ధూపాటి ఏసోబు, బండారు వెంకటేశ్వర్లు, దేవరపల్లి అంజిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేమూరు : గ్రామాల్లో పల్లె పండుగ సందర్భంగా చుండూరు మండలం యడ్లపల్లి, అమర్తలూరు, వేమూరు మండలంలోని వెల్లబాడు, కుచ్చెళ్ళపాడు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. వెళ్ళబాడు, కుచ్చేళ్లపాడు గ్రామాల్లో రూ.10లక్షలతో సిసి రోడ్డు, చుండూరు మండలం యడ్లపల్లిలో రూ.25లక్షలు, అమర్తలూరులో రూ.30లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, తహశీల్దారు, ఎంపిడిఒ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మేదరమెట్ల ఎంపిపి ప్రసన్న కుమారి

మేదరమెట్ల : పల్లె పండుగలో భాగంగా మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో సిసి రోడ్లు, బీసీ కాలనీలో మురుగు కాల్వల నిర్మాణానికి రూ.20లక్షలతో నిర్మించేందుకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ సాదినేని విజయ్ కుమారి, పంచాయతీరాజ్ ఎఇ ప్రసాదరావు, ఉపాధి హామీ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అద్దంకి ఎంపిడిఒ శింగయ్య

అద్దంకి : గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఎంపిడిఒ సింగయ్య తెలిపారు. మండలంలోని చిన్నకొత్తపల్లి, గోవాడ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న కొత్తపల్లి, గోవాడ, సింగరకొండపాలెం గ్రామాల్లో సిసి రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు, ప్రజలకు ఎన్ఆర్ఇజిఎస్ పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఎపిఒ గాయత్రిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, తెలుగుదేశం నాయకులు మానం మురళీమోహన్ దాస్, చాగంటి గణపతి పాల్గొన్నారు.

రేపల్లె : మండలంలోని పేటేరు, కారుమూరు, మోర్లవారిపాలెం గ్రామాల్లో పంచాయతీ రాజ్ వారోత్సవాలు ప్రారంభమైనట్లు ఎంపిడిఒ ఎం శోభారాణి తెలిపారు. పల్లె పండుగలో భాగంగా పేటెరు పంచాయతీతో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, కారుమూరు పంచాయతీలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు శంకుస్థాపన చేశారు. ఈ సంధ్భంగా ఎంపిడిఒ ఎం శోభారాణి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజల సంక్షేమం కోసం గ్రామాలను అభివృద్ధి చేయడమే పల్లె పండుగ ఉద్దేశం అన్నారు. గ్రామాల్లో పలు అభివృద్ధికి సిసి రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. పండుగ వాతావరణంలో గ్రామాల్లో వారోత్సవాలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈనెల 20వరకు పల్లె పండుగ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శోభారాణి, పంచాయతీ కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, గూడపాటి శ్రీనివాసరావు, ఆరేపల్లి వీరబాబు, గోలి వెంకటేశ్వరరావు, రెబ్బ కోదండరాం, నోడల్ అధికారులు, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేపల్లెలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిడిఒ శోభారాణి

సాంకేతిక పరిజ్ఞానంపై యువత నైపుణ్యం కలిగి ఉండాలి

మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్

ప్రజాశక్తి - బాపట్ల

సాంకేతిక పరిజ్ఞానంపై యువత నైపుణ్యం కలిగి ఉండాలని మాజీ ఎంఎల్‌సి అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని కాకుమాను వారిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలివేట్ ఎఐ స్మార్ట్ ట్యూషన్స్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు నైపుణ్యం అవసరమని అన్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కల్పించేందుకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఐటీ రంగంలో 15ఏళ్లుగా అనుభవం కలిగిన కెనడాకు చెందిన నిపుణుల పర్యవేక్షణలో ఎలివేట్ ఎఐ రూపొందించిన సాఫ్ట్వేర్ ద్వారా విద్యార్థులకు చదువును పర్యవేక్షించి తగిన ప్రణాళికలతో మెరుగు పర్చేందుకు ఇటువంటి శిక్షణా కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానంపై మరింత నైపుణ్యం పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎలివేట్ ఎఐ స్మార్ట్ ట్యూషన్స్ అధినేత దండే యజ్ఞనారాయణ, కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిక్షణా కేంద్రం ప్రారంభిస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

ఆగని వర్షం..పొంగిన వాగులు..

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన రాకపోకలు
- గ్రానైట్ క్వారీల్లోకి చేరిన నీరు
- తీరంలో ఎగసిపడుతున్న అలలు

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నాగులుప్పలపాడు-తిమ్మాపురం మధ్యలో ఉన్న నిడమానూరు, కొత్తకోట, హనుమాపురం వద్ద ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో కొత్తకోట, హనుమాపురం

పొంగిప్రవహిస్తున్న హనుమాపురం వాగు (నాగులుప్పలపాడు)

గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ రెండు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. భయటకు వచ్చేమార్గం లేక ఆ గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా ఉప్పుగుండూరు వద్ద నాగన్నవాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. మట్టిగుంట వాగు, మాచవరం ఉప్పుగుండూరు మధ్య ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల వద్ద వరద నీటి ఉధృతిని తహశీల్దారు కె.ప్రవీణ్ కుమార్, ఎంపిడిఒ వై. మహాలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. వాగుల వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాగులుప్పలపాడు ఎస్‌టి కాలనీ వాసులకు స్థానిక హైస్కూల్‌కు తరలించారు.

చీమకుర్తి : వర్షం కారణంగా ప్రజలు సతమతమవుతున్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో గ్రానైట్ క్వారీలు మూతపడ్డాయి.క్వారీల్లోకి సుమారు 5 నుంచి 10 అడుగుల మేర నీరు చేసింది. దీంతో పనులు నిలుపుదల చేశారు. క్వారీల్లోని నీటిని బయటకు పంపుతున్నారు. 75,100,120 హెచ్‌పి మోటార్లు ఏర్పాటు చేసుకొని నీటిని బయటకు పంపుతున్నారు. వర్షం కారణంగా క్వారీల్లోని ర్యాంపులు దెబ్బతిన్నాయి. గోల్డెన్,ఆనంద్, సూర్య, వాసవీ,పెరల్, కృష్ణసాయి, మణికంఠ, మిడ్‌వెస్ట్, వీరభద్ర, సదరన్ క్వారీల్లోకి నీరు చేరింది. వర్షపునీటిని బయటకు పంపేందుకు పదిరోజులు పట్టే అవకాశం ఉన్నట్లు ఆయా క్వారీల మేనేజర్లు చెబుతున్నారు. అదేవిధంగా రోడ్లు దెబ్బతిన్నాయి. యల్లయనగర్ ,రామతీర్థం ,త్రిక సినిమాహాలు సెంటర్లలో ఒంగోలు-కర్నూలు రహదారి ధ్వంసమైంది. వర్షపునీరు నిలిచిపోయి మోకాలు లోతు గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఇక్కడ రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనాలు, భారీ వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

కొత్తపట్నం : తుఫాను ప్రభావంతో పల్లెపాలెం వద్ద సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. నీరు సుమారు పది మీటర్లు ముందుకు వస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మత్స్యకారులు వేటను నిలిపి బోట్లు, వలలను ఒడ్డుకు చేర్చుకున్నారు. సముద్రంలోనికి ఎవరూ దిగకుండ మెరైన్ పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తహశీల్దారు

చీమకుర్తిలో గ్రానైట్ క్వారీలోకి చేరిన నీరు

మధుసూదన్ తీరం వెంబడి, లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. గంగమ్మ కాలనీలో ఇళ్లలోని వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో అధికారులు మోటారు సహాయంతో నీటిని తరలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు

పొంగి ప్రవహిస్తున్న కొత్తకోట వాగు (నాగులుప్పలపాడు)

ఎంపిడిఒ శ్రీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శింగరాయకొండ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వీధులు జలమయం అయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ

ఒంగోలులో వాహన చోదకుడి ఇక్కట్లు

సక్రమంగా లేక పోవడంతో నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి బస్టాండులోకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని అప్పాపురం గిరిజన కాలనీలోని ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, టిడిపి నాయకుడు శీలం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జెసిబి సహకారంతో ఇళ్లలోని నీటిని బయటికి పంపేందుకు చర్యలు చేపట్టారు. తహశీల్దారు టి.రవి, ఎండిపిఒ జయమణి, ఎస్ఐ బి.మహేంద్ర అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

శింగరాయకొండ బస్టాండ్‌లోకి చేరిన వర్షపు నీరు

శింగరాయకొండలో రహదారిపై ప్రవహిస్తున్న నీరు

కొత్తపట్నంలో లోతట్టు ప్రాంతంలో పర్యటిస్తున్న తహశీల్దారు

పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-టంగుటూరు

భారీ వర్షాల నేపథ్యంలో పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి అన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. మండల పరిధిలోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. గుడిసెల్లో నివాసముంటున్న 11 గిరిజన కుటుంబాలకు చెందిన 35 మందికి ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నట్లు తహశీల్దారు ఆంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం వారికి పెడుతున్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా వడ్డించారు. అదేవిధంగా పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్‌డిఒ కె. లక్ష్మీప్రసన్న, ఎంపిడిఒ దేవసేన కుమారి, తహశీల్దారు ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ జక్కంపూడి శ్రీనాథ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

శింగరాయకొండ : తుఫాను ప్రభావం వల్ల ప్రజలకు

టంగుటూరు పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్

ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మండల పరిధిలోని పాకల గ్రామంలోనున్న తుఫాను షెల్టర్లను సోమవారం పరిశీలించారు. రెండు రోజుల్లో తుఫాను ఉధృతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రజలకు

నాగులుప్పలపాడులో బాధితులతో మాట్లాడుతున్న జేసీ

అందుబాటులో ఉండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్‌డిఒ లక్ష్మీప్రసన్న, తహశీల్దారు టి.రవి, ఆర్ఐ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి సుభాని తదితరులు ఉన్నారు.

నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సందర్శించారు. పునరావాస కేంద్రంలోఅన్నివ సతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జేసీ వెంట తహశీల్దారు కె. ప్రవీణ్ , ఎంపిడిఒ వై. మహాలక్ష్మి విఆర్ఒలు, అధికారులు ఉన్నారు.

ఎస్‌వికె ట్రస్టు సభ్యులు గంగాడి వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

జి.వెంకటేశ్వర్లు(ఫైల్)

కొప్పోలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కామ్రేడ్ గంగాడి వెంకటేశ్వర్లు వయోభారం, అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. వెంకటేశ్వర్లు మాస్టారు సుదీర్ఘకాలం వామపక్ష ఉద్యమ సానుభూతి పరులుగా, కొప్పోలు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులుగా నిబద్ధతతో పనిచేశారు. 1940 జూన్ 15న గంగాడి రామయ్య, కోటమ్మ దంపతులకు జన్మించిన కామ్రేడ్ వెంకటేశ్వర్లు 1973లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. కొత్తపట్నం మండల పరిధిలోని పల్లెపాలెం, కొత్తపట్నం జడ్‌పిస్కూల్, వలస పాలెంలో పనిచేశారు. 1998 జూన్‌లో ఉద్యోగ విరమణ చేశారు. రంగస్థల కళాకారుడిగా 'దోపిడీ', 'చైర్మన్' తదితర నాటకాల్లో అద్భుతంగా నటించారు. తన నటనా సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రజలను ఆలోచింపజేసేవారు. కొత్తపట్నం మండలం వలసపాలెంలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయఅవార్డు అందుకున్నారు. వెంకటేశ్వర్లు మాస్టార్‌కు భార్య హనుమాయమ్మ, కుమారులు బాలమురళీకృష్ణ, రామకృష్ణ, కుమార్తె సుశీల ఉన్నారు. వెంకటేశ్వర్లు మాస్టార్ మృతికి సిపిఎం కొప్పోలు శాఖ ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసింది. గంగాడి మాస్టారు అభ్యుదయ భావాలను, కళలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని సిపిఎం కొప్పోలు శాఖా కార్యదర్శి హనుమంతరావు, ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు.

నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి

యానాదయ్యకు మంత్రి నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని జమ్ములపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు మక్కెన యానాదయ్య దిశదిన కర్మ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని యానాదయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

మాట్లాడుతున్న మంత్రి స్వామి

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని తెలిపారు. వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పల్లె పండుగ సభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ స్వరూపరాణి

గోరేగపూడిలో శంకుస్థాపన చేస్తున్న భట్టిప్రోలు ఎంపిపి, ఎంపిడిఒ

ప్రజాశక్తి - పంగులూరు

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపిడిఒ కె స్వరూపరాణి అన్నారు. గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ నాంది కావాలని అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల పనులు చేపట్టారు. రూ.1.52కోట్ల విలువైన పనులు చేసి 693 కుటుంబాలకు ఉపాధి కల్పిం చినట్లు తెలిపారు. వీటిలో రూ.30లక్షల వ్యయంతో 597 మీటర్ల పొడవున సిమెంటు రోడ్డు, రూ.4.60 లక్షలతో రెండు గోకుల శాలలు మంజూరైనట్లు తెలిపారు. పండ్లతోటల పెంపకానికి రూ.5.49 లక్షలు, 16,500 మీటర్ల పొడవు గల పంట కాలు వల పునరుద్ధరణకు రూ.35.70 లక్షలు, ఒక ఫారం పాండుకు రూ.41వేలు మంజూరైనట్లు తెలిపారు. 35ఇతర పనులకు రూ.75.80 లక్షలు మంజూరైనట్లు అన్నారు. ఈ పనులతో పంచాయతీలో పం డుగ వాతావరణం నెలకొందని చెప్పారు. నోడల్ ఆఫీసర్, ఎంఇఒ జి వీరాంజనేయులు మాట్లాడు తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం సిమెంటు రోడ్డు నిర్మాణానికి సర్పంచి పెంట్యాల కృష్ణారావు శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ఎఇ గడ్డం హనుమంతరావు, ఇఒఆర్డి సుమంత్, ఎపిఒ సంతో షమ్మ, తెలుగుదేశం నాయకులు మురకొండ సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి కర్రి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

యద్దనపూడి : మండలంలోని వింజనంపాడు, శ్యామలవారిపాలెం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మహ్మద్ అఖీబ్ జావేద్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజల సంక్షేమం కోసం కృషి చేయడమే పల్లె పండుగ ఉద్దేశం అన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, త్రాగు నీటి వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా వింజనంపాడు గ్రామంలో రూ.15లక్షలతో సిసి రోడ్డు, గోకులం షెడ్డుకు శంకుస్థాపన చేశారు. మరమ్మత్తులు పూర్తి చేసిన తాగునీటి ప్లాంటును పునః ప్రారంభిచారు. శ్యామల వారిపాలెం గ్రామంలో రూ.10లక్షలతో సిసి రోడ్డు, గోకులంకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిఆర్ డిఇఇ, ఇఒఆర్డి, ఎపిఒ, పంచాయతీ కార్యదర్శులు, వింజనంపాడు ఉప సర్పంచ్ రంగారావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో సిసి రోడ్డుకు భూమి పూజ చేస్తున్న అనగాని శివప్రసాద్

చెరుకుపల్లి : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. చెరుకుపల్లిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. స్థానిక ఆదర్శ కాలనీ వాసులు ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న సిమెంట్ రోడ్డుకు పల్లె పండుగ ద్వారా సిమెంటు రోడ్డుకు మోక్షం కలిగిందని అన్నారు. మొదటి విడతగా రూ.20లక్షల నిధులతో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టిఓ రామలక్ష్మి, తహశీల్దారు పద్మావతి, జనసేన కన్వీనర్ మత్తి భాస్కరరావు, సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంఆర్‌కె మూర్తి, దివి రాంబాబు, మల్లాది రామకృష్ణ, గోగినేని వసుధ, తుళ్లూరు శివవెంకటరామారావు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని గొరిగపూడి పంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రు.2.30లక్షల నిధులతో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు ఎంపిడిఒ ఎస్‌వి రమణ తెలిపారు. పల్లె పండుగతో ఆయా గ్రామాలను ముందుగా ఇచ్చిన షెడ్యూల్లో కొన్ని మార్పులు చేసినట్లు తెలిపారు. 15న ఐలవరం, 16న ఆళ్ళమూడి, పల్లెకోన, రాచూరు, కొనేటిపురం, సూరేపల్లి, 18న ఓలేరు, కన్నెగంటి వారిపాలెం, పెద్దపులివర్రు, పెదలంక, పెసర్లంక, చింతమోటు, వెల్లటూరు, 19న భట్టిప్రోలు గ్రామంలో పల్లె పండుగ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి డివి లలిత కుమారి, సర్పంచ్ జి మల్లిక, ఎంపిటిసి వి పున్నయ్య, ఈఒపిఆర్డి టి ఊహారాణి, ఎపిఒ శివపార్వతి పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలోని దేవరపల్లి, తిమ్మరాజుపాలెం, చెన్నుభట్ల వారిపాలెం, అన్నంపట్ల వారిపాలెంలో పండుగ వాతావరణం తలపించేలా పల్లె పండుగ నిర్వహించినట్లు ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. రూ.90లక్షల విలువైన తొమ్మిది పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాలలో పిఆర్డిఈ ఆదినారాయణ, పిఆర్ ఎఇ శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు ఎన్‌కె షంషుద్దీన్, ఎం శేఖర్ బాబు, కొరిటాల సురేష్, ఎంపిటీసీ కాపు రవిచంద్ర, సర్పంచులు మానవ సాంబశివరావు, నెల్లూరు అనంతమ్మ, రామారావు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీసీ సిబ్బంది, ఎపిఒ బుల్లయ్య పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న యద్దనపూడి ఎంపిడిఒ జావేద్

పర్చూరు మండలంలోని పల్లెపండుగలో ఎంపిడిఒ ప్రద్యుమ్నకుమార్

వికలాంగురాలి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక భవిత కేంద్రంలో 10వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న వినికిడి లోపం గల విద్యార్థిని కోవూరి దుర్గ తండ్రి శ్రీనివాసరావు అకాలంగా మృతి చెందారు. వీరికి ఆడపిల్లలు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద కుటుంబం కావడం వలన ఆ కుటుంబానికి ఆదరణ కొరకు ఫిజియో థెరపిస్ట్ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని తన వంతు సహాయంగా 50కేజీల బియ్యం, పండ్లు, కూరగాయలు, రూ.2వేల నగదు సహాయం అదించారు. కుటుంబానికి సహాయం అదించిన ఇందిరా ప్రియదర్శినిని ఎంఇఒ డి గంగాధరరావు, బి సుధాకరరావు అభినందించారు.

సహాయం అందజేస్తున్న ఫిజియో థెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని

లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్

లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - బాపట్ల

ఎడతెరిపిలేని వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన శారదాపురి కాలనీ, వెన్నెలకంటి నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, ఇందిరా నగర్ ప్రాంతాలను మునిసిపల్ కమీషనర్ జి రఘునాథరెడ్డి సోమవారం పరిశీలించారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అధిక వర్షాలకు ఆయా కాలనీల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నీరు నిల్వలు వున్నచోట వ్యాధులు ప్రబల కుండా యాంటీ లార్వా పిచికారి చేయాలని అన్నారు. తుపాను తీవ్రమైతే ఆ ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఆయన వెంట ఎఇలు ఉమామహేశ్వరరావు, ప్రసాదరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బల్లికురవ కూడలిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీళ్లు

వర్షంతో రహదారిపై చేరిన నీరు

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం కురిసిన భారీ వర్షంకు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వర్షపు నీరు రహదారిపైన నిలిచి పోయింది. ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూడలిలో సైడ్ కాలవలు లేనందున ఇటువంటి ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గత వైసిపి పాలనలో సైడు కాలువలు నిర్మాణం చేపడతామంటూ తూతూ మంత్రంగా కాలం గడిపారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో రోడ్లపై కనీసం గుంటలు కూడా పూడ్చలేదని, దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకున్నాయని చెబుతున్నారు. నేటి కుటమీ పాలనలోనైన కాల్వల నిర్మాణాలు చేపడతారో లేదోనని స్థానిక ప్రజానీకం ఎదురు చూస్తున్నారు. స్థానిక

అట్రాసిటీ రిలీఫ్ ఫండ్ రిలీజ్ చేయాలి

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ రిలీఫ్ ఫండ్ వెంటనే రిలీజ్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రూ.50వేల కోట్లతో బడ్జెట్ కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేదరమెట్ల వచ్చి ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అధికారాన్ని చేపట్టి ఐదు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. తిరుపతి లడ్డులో నెయ్యి అంశం మీద ఉన్న ప్రేమ ఎస్సీ, ఎస్టీల మీద లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషనర్ కన్నబాబును కలిసి అట్రాసిటీ కేసులకు సంబంధించిన రిలీఫ్ ఫండ్ రిలీజ్ చెయ్యాలని డిమాండ్ చేశామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడటానికి అవసరమైన ఎస్సీ, ఎస్టీల ఓట్లు వారి అభివృద్ధి కోసం పనికిరావాని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం కేంద్రం నుండి నిధులు తెప్పించి అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ధార అంజయ్య, కాకుమాను రవి, ఎర్రమల శ్రీనివాసరావు, మక్కెన వరకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

డిఎస్‌సిలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - బాపట్ల

షెడ్యూల్ కులాలు, తెగల అభ్యర్థులకు డిఎస్‌సి పరీక్షలకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ సాధికారత జిల్లా అధికారి జె రాజా దెబోరా సోమవారం తెలిపారు. డిఎస్‌సి పరీక్షలకు సిద్ధమౌతున్న అభ్యర్థుకు ఉచిత బోధన, భోజన వసతి సౌకర్యాలను రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన స్టడీ సర్కిల్, ఇతర కోచింగ్ సెంటర్లలో 3నెలల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21లోపు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. http://jnanabhumi.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఎస్‌జిటి అభ్యర్థులు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు డిగ్రీ, బిఈడి, టెట్ అర్హతలు కలిగి ఉండాలని అన్నారు. అభ్యర్థుల వార్షికాదాయం రూ.2.50లక్షలకు మించ కూడదని తెలిపారు. అలాంటి అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని, ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
7
మంగళవారం 15 అక్టోబర్ 2024

వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం

పర్చూరు వంతెనను అలుముకొన్న రావి చెట్లు

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు వాగుపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో దానిని పడగొట్టి నూతనంగా వంతెన నిర్మించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రోడ్డు భవనాల శాఖ మంత్రి జానారెడ్డి వంతెనకు 1986లో శంకుస్థాపన చేశారు. రెండేళ్ల కాలంలోనే ఈ వంతెన నిర్మాణం పూర్తయింది. నిత్యం వేలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వంతెన పరిస్థితి ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. రావి చెట్టు వేర్లతో వంతెనకు ఇరువైపులా పెద్ద చెట్టుగా అల్లుకుని వేర్లు వంతెన గోడల్లోకి వెళ్లి పగుళ్లు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. వంతెన గోడల్లోకి వెళ్లిన వేర్లు పెద్ద చెట్లుగా పెరిగి వంతెన శిథిలావస్థకు చేరే ప్రమాదం పొంచి ఉంది. వంతెన పైన ఇరువైపుల రోడ్డుపై చిల్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. వీటితో ద్విచక్ర వాహన దారులు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. వాడరేవు, పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణం పనులకు పెద్ద పెద్ద వాహనాలు అధిక లోడుతో వంతెనపై తిరుగుతున్నాయి. దీనివల్ల రావి చెట్టు వేర్లు లోపలికి చొచ్చుకుపోయి వంతెన నెర్రలిచ్చింది. దీనికి తోడు అధిక లోడుతో భారీ వాహనాల రాకపోకలతో వంతెన

కోతకు గురైన వంతెన ఒడ్డున వేస్తున్న ఖాళీ కొబ్బరిబొండాలు

శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. వంతెన ఉత్తరం వైపు గట్టు కొంత కోసుకుపోవటంతో గుంతగా ఏర్పడింది. ఆ గుంటలో కాళీ కొబ్బరి బోండాలు వేస్తున్నారు. వంతెన సమీపంలో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి వంతెనకు ఇరువైపులా లోపల ఉన్న చెట్లను తొలగించి వంతెన పటిష్టతకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఉప్పుటూరు వాగుపై నిర్మించిన వంతెన కూడా రెండు వైపులా రావి చెట్టు వేర్లు అలుముకున్నాయి. ఈ వంతెనపై జిల్లా కేంద్రమైన బాపట్లకు రాకపోకలు ఎక్కువ సాగిస్తూ ఉంటారు. వంతెన కిరువైపులా ఉన్న చెట్లను తొలగించి వంతెన భద్రతకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మర్రిచెట్టు వేర్లతో పగుళ్లిచ్చిన పర్చూరు వాగుపై వంతెన

పల్లె పండుగను జయప్రదంగా నిర్వహించాలి

కలెక్టర్ జె వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పల్లె పండుగ, పంచాయితీ వారోత్సవాలు జయప్రదంగా నిర్వహించాలని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన టెలి కాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే అభివద్ధి కార్యక్రమాలపై అధికారులు విస్తతమైన ప్రచారం చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో రూ.88కోట్ల నిధులతో అభివద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పంచాయితీ శాఖ ద్వారా కొన్ని పనులు జరుగుతుండగా, మరికొన్ని పనులు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్వహిస్తున్నట్లు

టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ జె వెంకట మురళి

వివరించారు. స్మశాన వాటికలు, మురికి కాల్వలు, సిసి రోడ్లు, వసతి గ్రహాలు, పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఏయే గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టారనే అంశాలపై ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి ప్రచార బోర్డుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలను ఉంచాలని అన్నారు. భూమి పూజ చేసిన తదుపరి కార్యక్రమం ఫోటోలను సంబంధిత యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. 454 గ్రామ పంచాయతీలు ఉండగా, ప్రతి పంచాయతీలో నిర్వహించే కార్యక్రమాలను జియో ట్యాగింగ్ చేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో విధిగా ప్రోటోకాల్ పాటించాలని అన్నారు. వారోత్సవాలు జయప్రదంగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచనలు చేశారు. సమావేశంలో డ్వామా పిడి విజయలక్ష్మి, పిఆర్ ఎస్ఈ హరేరామకష్ణ, డిపిఓ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం బస్టాండులో వర్షపు నీటి ఉధృతి

పాతమార్కెట్ వద్ద రోడ్డుపై వర్షపు నీళ్లు

భారీవర్షంతో రహదారులన్నీ జలమయం

ప్రజాశక్తి - ఒంగోలు

నగరంలో భారీ వర్షం కురిసింది. వర్షానికి నగరంలోని రహదారులు అన్నీ జలమయం అయ్యాయి. వర్షపు నీటి ప్రవాహంతో మురుగు కాల్వలు రోడ్లపైకి పొర్లి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొత్తపట్నం బస్టాండు సెంటర్, పాత మార్కెట్, రాజీవ్‌గృహ కల్ప, ఆర్టీసీ బస్టాండుతోపాటు నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో అస్తవ్య స్తంగా మారాయి. ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో ప్రయాణికులు, పట్టణంలో వివిధ పనులపై బయటికి వచ్చిన ప్రజలు తలదాచు కునేందుకు పరుగులు తీశారు. వర్షపు నీటిలో ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగర శివారు కాలనీల్లో నీళ్లు నిలిచి ఇబ్బందులు పడ్డారు.

రాజీవ్‌గృహకల్ప వద్ద జలమయం

ఆర్టీసీ బస్టాండు వద్ద వర్షపు నీటిలోనే ప్రయాణం

జోరు వానలో నిరసన వ్యక్తం చేస్తున్న మార్కాపురం మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని

జోరువానలో నిరసన

ప్రజాశక్తి - మార్కాపురం

తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జోరువర్షంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 21మంది కార్మికులను అక్రమంగా ఎటువంటి నోటీసు లేకుండా తొలగించడాన్ని ఆయన వ్యతిరేకించారు. కార్మిక చట్టాలను పాటించకుండా ఏకపక్షంగా అధికారులు తొలగించడాన్ని ఖండించారు. కార్మికుని తొలగించాలంటే కనీస నియమనిబంధనలు పాటించకుండా ఏకపక్షంగా తొలగిస్తున్నామని చెప్పడం దుర్మార్గమని అన్నారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఇటువంటి చర్యలు పూనుకోవటం విచారకరమని అన్నారు. అక్రమ తొలగింపులు మానుకోవాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోరాటాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె సుబ్బరాయుడు, హరి, రమణ, శేశిరెడ్డి, యూసఫ్, సలాం ఖాన్, షేక్ ఇమాంసా, షేక్ షబ్బీర్, కనకయ్య పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

కాలువ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అబ్దుల్ రషీద్

వర్షం ప్రభావంతో డ్రైనేజీ కాలవలు పొంగి పొర్లుతుండడంతో రోడ్లపై నీళ్లు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్న సమస్య తెలుసుకున్న టిడిపి నియోజక వర్గ అధికార ప్రతినిధి ఎం మహేంద్రనాథ్ మున్సిపల్ అధికారులు పరిశీలించాలని సూచించారు. వెంటనే స్పందించి మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీర్ డ్రైనేజీ కాలవల్లో పూడిక తీయించారు. పనులను కమిషనర్ దగ్గరుండి పరిశీలించారు. చర్చి కాంపౌండ్ రోడ్డులో కుందేరు డ్రైనేజీ కాలువలను తీయించారు. కుందేరు, మసీదు సెంటర్ ప్రాంతంలో పర్యటించారు. తాత్కాలికంగా సమస్య పరిష్కారించారు. కాలువల శాశ్వత పరిస్కారం కోసం ఎంఎల్ఎ కొండయ్య ద్రుష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారు.

విద్యుత్ అక్రమాలపై తనిఖీలు

ప్రజాశక్తి - అద్దంకి

విద్యుత్ డిఇ మస్తానరావు ఆదేశాల మేరకు మండలంలోని శింగరకొండ చెరువు చుట్టుపక్కల చేపల చెరువులకు వాడుతున్న విద్యుత్ లైన్లు సోమవారం తనిఖీ చేశారు. అక్రమంగా వ్యవసాయ విద్యుత్తును చెరువులు నింపుటకు వాడుతున్న ఏడుగురిపై మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు చేసి రూ.1.75లక్షల అపరాధ రుసుం విధించినట్లు రూరల్ ఎఇ శివప్రసాద్ తెలిపారు. తరచుగా ఇటు వంటి తనిఖీలు ఈ ప్రాంతంలో నిర్వహిస్తామని తెలిపారు. తనిఖీల్లో రూరల్ సెక్షన్ సిబ్బంది పాల్గొనారు.

మద్యం షాపుల లాటరీ తీస్తున్న జెసి

మద్యం దుకాణాలు ఖరారు

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గంలోని 19మద్యం షాపులకు, పట్టణంలో ఏడు షాపులు, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో నాలుగేసి షాపులకు టెండరు దారులను లాటరీ పద్ధతిలో సోమవారం ఖరారు చేశారు. షాపులు దక్కించుకున్న వారి వివరాలు వెల్లడించారు. బాపట్ల పట్టణంలో నల్లమల్లి శ్రీనివాసరావు, తాత వేణుగోపాలరావు, దొప్పలపూడి రామ్మోహనరావు, ఇమ్మడి అరుణ, గోకరాజు యుధిష్టర్ వర్మ, కోళ్ళపూడి రవికుమార్, బాపట్ల మండలం నాలుగు షాపులకు విన్నకోట నారాయణరావు, గవిని నాగేశ్వరరావు, మద్దిబోయిన సుబ్బారావు, తట్టవర్తి సుబ్రహ్మణ్య గుప్త, పిట్టలవానిపాలెం మండలం నాలుగు షాపులకు గోకరాజు శ్రీధర్ రెండు షాపులు, తమలపాకుల అనిల్ కుమార్, ఎనుముల మధుసూదనరావు ఒక్కొక్క షాపు దక్కించుకున్నారు. కర్లపాలెం మండలంలో నాలుగు షాపులకు పనగారి శ్రీనివాస గౌడ్, లావు సునీత, గోకరాజు రామకృష్ణరాజు, ముదునూరి వెంకట నరసరాజు దక్కించుకున్నారు.

పర్చూరు : మండలంలోని మద్యం షాపుల టెండర్లు దక్కించుకున్న వారి వివరాలను ప్రొహిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భుజంగరావు తెలిపారు. షాపు నెంబర్ 103ను రంగినేని నాగరాజు, షాప్ నెంబర్ 104ను లింగిశెట్టి రామాంజనేయులు, షాప్ నెంబర్ 105 దొడ్డ శివ నాగేశ్వరరావు, షాప్ నెంబర్ 106 విన్నకోట సతీషుకు లభించాయని తెలిపారు. లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం భారీ వర్షాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి ఆదేశించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్లో సోమవారం ఆయన సమావేశమయ్యారు. మండల స్థాయి అధికారులతోనూ వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలతో మత్స్యకారులను సముద్రంలోకి వేటకు వెళ్ళనివ్వరాదని చెప్పారు. వేట కోసం సముద్రంలోకి వెళ్లిన వారు తక్షణమే వెనుకకు వచ్చేలా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ మిత్రులకు తక్షణమే సమాచారం పంపాలన్నారు. సముద్రంలో మునగడానికి వచ్చే పర్యాటకులను తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. ఎన్ డి ఆర్ ఎఫ్ బందాలను చీరాల, బాపట్లలో ఉంచాలని డిఆర్ఓ ను ఆదేశించారు. 19వ తేదీ వరకు అధికారులు, ఉద్యోగాలు ఎవరూ సెలవులు పెట్టరాదని, ఇప్పటికే సెలవుల్లో ఉంటే వారి సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ఆ ప్రాంతంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో పునరావాస కేంద్రాలను ఎంపిక చేసుకోవాలన్నారు. అల్పపీడనంతో ఎదురయ్యే విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లాలోని చెరువులు, కాల్వల గట్లు బలహీనంగా ఉండి గండ్లు పడే ప్రాంతాలను జల వనరులశాఖ అధికారులు గుర్తించాలన్నారు. సమస్య పరిష్కారానికి తాత్కాలికంగా లేదా శాశ్వత మరమ్మతు పనులపై అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలన్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగితే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చూడాలన్నారు. నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలితే తక్షణమే తొలగించి పునరుద్ధరించడానికి యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రొక్లయిన్లు, జనరేటర్లు వంటివి ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పురోగతిలో మౌలిక వసతుల పనులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రజాశక్తి
కథనానికి స్పందన

వెలిగొండ నిర్వాసితుల పునరావాసం కోసం అవసరమైన మౌలిక సదుపాయ పనులు పురోగతిలో ఉన్నాయని ఒంగోలు కన్‌స్ట్రక్షన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు ఎస్ అబుతలీం అన్నారు. ప్రజాశక్తి దినపత్రిలో ఈ నెల 14న 'కూటమి ప్రభుత్వం కరుణించేనా' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అబుతలీం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టన్నెల్-1లో మిగిలిన 500 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. టన్నెల్-2 బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్న 4.900 కిమీ మొదలు పెట్టి పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టుకు ఎనిమిది నెలలకు అవసరమైన రూ.199.16 కోట్లు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఇచ్చి గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రూ.61 కోట్ల బిల్లులను చెల్లించినట్లు తెలిపారు.

మద్యం దుకాణాల కేటాయింపులు

పారదర్శకతతో చేపట్టాం..

కలెక్టర్ జె.వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మద్యం నూతన విధానం ద్వారా మద్యం దుకాణాల కేటాయింపులు పారదర్శకతతో చేపట్టామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ సోమవారం స్థానిక ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. మద్యం దుకాణాలకు అత్యధికంగా దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక కౌంటర్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరు కాగా అధికారులు టెండర్ బాక్స్‌లను తెరిచారు. మరొక కౌంటర్ వద్ద జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ హాజరు కాగా ఎక్సైజ్ అధికారులు టెండర్ బాక్స్ లను తెరిచారు. బాపట్ల జిల్లాలో 117 దుకాణాలకు 2,149 దరఖాస్తులు వచ్చాయని ఇఎస్ గంటా దేవదత్తు ప్రకటించారు. అనంతరం ఒక్కొక్క దుకాణానికి అత్యంత పారదర్శకంగా లాటరీ నిర్వహించారు. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా, ప్రజల శ్రేయస్సును కోరుతూ మద్యం దుకాణాల కేటాయింపులలో అందరికీ సమాన అవకాశం కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాణ్యమైన

లాటరీ తీస్తున్న కలెక్టర్ వెంకటమురళి

మద్యం అందించడానికే నూతన విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దరఖాస్తుదారులంతా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో సహకరించారన్నారు. అధికారులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. చట్టబద్ధంగా నిర్వహించే కార్యక్రమంలో అధికారులు, వ్యాపారుల సహకారం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మద్యం నూతన విధానాన్ని పక్కాగా అమలయ్యేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంటా దేవదత్తు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు,బాపట్ల ఆర్ డి ఓ పి గ్లోరియా, ఎక్సైజ్ శాఖ సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో

ప్రాణనష్టం జరగకుండా చర్యలు

- గర్భిణీలు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ
- పంట నష్టం జరగకుండా చూడాలి
- టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. అత్యవసరమైతే తప్ప రాబోయే నాలుగు రోజులపాటు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్దారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను వివరించి, వాటిని అమలు చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. భారీ వర్షాల దష్ట్యా మరో నాలుగు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి

మరో వారం రోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న మహిళలను ఆసుపత్రులలో చేర్పించాలని వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు. చిన్నారులు, వికలాంగులు, వృద్ధులు, బాలింతలు ఎలాంటి ఇబ్బందులకు

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మంగళవారం నాడూ సెలవు

భారీ వర్షాల దృష్ట్యా మంగళవారం కూడా జిల్లాలోని అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏవైనా సంక్షేమ హాస్టళ్ళు ప్రమాదకర స్థితిలో ఉంటే వాటిలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను తక్షణమే ఇతర హాస్టల్స్, సమీపంలోని సురక్షిత భవనాల్లోకి తరలించాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు.

పంట నష్టం నివారించాలి

భారీ వర్షాలతో పంటలు నీట మునగకుండా చూడాలని, ఈ విషయంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, వారి పడవలను కూడా తీరంలో లంగరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఫీల్డ్‌లోనే మొత్తం సిబ్బంది

పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, విద్యుత్, రెవెన్యూ, పోలీసు, నీటి పారుదల, వైద్య, గ్రామీణ నీటి సరఫరా శాఖల సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సెలవులు రద్దు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో నిరంతరం వచ్చే నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వివిధ స్థాయిలలో కంట్రోల్ రూములు

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, వివిధ శాఖల మధ్య సమన్వయం కలెక్టర్ కార్యాలయంలో 1077 టోల్ ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆయా అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లో పనిచేసే సిబ్బంది అప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు, వాటిని సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసిన వివరాలతో ప్రతి గంటకు తనకు నివేదిక పంపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ముగిసిన మద్యం షాపుల కేటాయింపు

- జిల్లాలో 171 షాపులకు 3,466 దరఖాస్తులు
- 15 షాపులు దక్కించుకున్న మహిళలు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. జిల్లాలోని 171 మద్యం షాపుల కోసం 3466 దరఖాస్తులు రావడంతో అధికారులు సోమవారం లాటరీ విధానంలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. దరఖాస్తు చేసుకున్న మహిళలు లాటరీ ప్రక్రియలో పాల్గొన్నారు. 171 షాపులలో 15 షాపులను మహిళలు దక్కించుకోవటం గమనార్హం. జోరు వాన కురుస్తున్నా దరఖాస్తుల రాకతో ఒంగోలు అంబేద్కర్ భవనం పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియను ఖండిస్తూ ఐద్వా, పిఒడబ్ల్యుఒ ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టి ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జిల్లాలో మద్యం షాపులను లాటరీ ద్వారా ఎంపిక చేసే ప్రక్రియ సోమవారం ముగిసింది. ఒంగోలులోని అంబేద్కర్ భవనంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెండు కౌంటర్ల ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టర్ నేతత్వంలోని కౌంటర్-1లో ఒంగోలు, చీమకుర్తి, శింగరాయకొండ, పొదిలి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 80 షాపులకు, సంయుక్త కలెక్టర్ నేతత్వంలో కౌంటర్-2 లో దర్శి, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెం స్టేషన్ల పరిధిలోని 91 షాపులకు లాటరీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ అధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లుచేశారు.

షాపులు దక్కించుకున్న 15 మంది మహిళలు

లాటరీలో ఎంపికైన 171 మందిలో 15 మంది మహిళలు ఉన్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామోహీయుద్దీన్ తెలిపారు. ఎంపికైన వారు లైసెన్స్ రుసుములో ఆరో వంతు చెల్లించిన అనంతరం వారికి మంగళవారం ప్రొవిజనల్ లైసెన్స్ అందజేస్తామన్నారు. వీరు బుధవారం నుంచి షాపులను ప్రారంభించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌పి కె.నాగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ, జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత, ఒంగోలు ఆర్డీవో కె. లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, సత్యనారాయణ, కుమార్, జడ్పీ సిఈఒ బి.చిరంజీవి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
ఎన్.ఎస్.నగర్ ఆస్థులు
ఎ.బి.ఎం. ఆస్థులపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు
ప్రముఖ పారిశ్రామికవేత్త జలదాత
నాదెళ్ల సుబ్రమణ్యం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఎన్.ఎస్. నగర్ ఆస్థులను, ఎ.బి.ఎం. ఆస్థులను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బ్రోకర్లు, కొంత మంది తప్పుడు సొసైటీల ప్రతినిధులు, కొంత మంది కుల సంఘాల ప్రతినిధుల వారు చేస్తున్న తప్పుడు ప్రచారంపై వివరణ.

ఇటీవల కాలంలో మార్కాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం తప్పుడు మార్గంలో ఆదాయం పొందాలనే దురుద్దేశంతో మార్కాపురం పట్టణంలోని ఎన్.ఎస్.నగర్ ఆస్థులను, ఎ.బి.ఎం. ఆస్థులుగా చూపుతూ తప్పుడు ప్రచారం చేస్తూ తమకు ఇష్టం వచ్చినట్లుగా ప్రకటనలు చేస్తూ అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారు.

మార్కాపురం పట్టణంలో తాను (నాదెళ్ల సుబ్రమణ్యం), హనుమాన్ రియల్ ఎస్టేట్ (నాదెళ్ల నాగవేణి) అనువారము 30 సంవత్సరాల క్రితం ఎ.బి.ఎం. కాంపౌండ్ ఆస్థులను చట్టబద్ధంగా కొనుగోలు చేసి, తదుపరి లేఅవుట్‌లు వేసి ఆస్థులను వివిధ రకాల వ్యక్తులకు, ఇంకా పలువురికి చట్టబద్ధంగా అమ్మకం చేసివున్నాము. అమ్మకం జరుపగా మాకు మిగులు భూమి కొంత కలదు.

ఈ ఎన్.ఎస్.నగర్‌లో పెద్దపెద్ద నిర్మాణాలు జరిగివున్నవి. మార్కాపురం మున్సిపాలిటీ వారు రోడ్లు, డ్రైనేజి కాలువలు కట్టి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. పట్టణాభివృద్ధికి తాము సహకరిస్తున్నాము. మా సంస్థ ద్వారా కొద్దిగా ఆర్థిక సాయం చేసి రూరల్ గ్రామాలైన కొండేపల్లి,రామచంద్రాపురం, శివరాంపురం తదితర గ్రామాలకు ప్రజలు రాకపోకలకు అనువుగా బ్రిడ్జిని కూడా కట్టించడం జరిగింది.

ఈ ఎన్.ఎస్.నగర్‌లో అనేక మంది వైద్య ప్రముఖులు కార్పొరేట్ వసతులతో హాస్పిటల్స్ కట్టారు. అత్యాధునిక వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఎన్.ఎస్.నగర్ ఇలా పట్టణాభివృద్ధిలో ఒక భాగమైంది.

మా మిగులు భూమిపై అక్రమ లాభాపేక్షతో మమ్ములను తప్పుడు వ్యక్తులుగా ప్రచారం చేస్తూ అవమానపరచాలనే ఉద్ధేశంతో పైన తెలిపిన వారు తప్పుడు ప్రచారం చేస్తూ, అధికారులకు అర్జీలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

కొన్ని తప్పుడు పత్రాలతో గౌరవ కోర్టును కూడా తప్పుదోవ పట్టిస్తూ మమ్ములను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ మిగులు భూమి మాకు తప్ప మరెవరికీ హక్కు లేదు. గత 30 ఏళ్ళుగా మా ఆధీనంలోనే ఉంది.

పట్టణాభివృద్ధిని కాంక్షిస్తున్న తమను బ్లాక్‌మెయిలింగ్ ధోరణిలో అదే పనిగా వివిధ శాఖల అధికారుల వద్దకు వెళ్లి తప్పుడు అర్జీలు పెట్టి మా నుంచి ఏదో ఆశిస్తునాశీరు. అలా ఎవరు చేసినా ఉపేక్షించేది లేదు. తప్పుడు ప్రచారాలను దయవుంచి మార్కాపురం ప్రాంత ప్రజలు, అధికారులు, నాయకులు నమ్మవద్దని తెలియజేయడమైనది.

ఇట్లు
పైడిమర్రి రామచంద్ర,
అడ్వకేట్, మార్కాపురం,
సెల్: 9392025015.